క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



వాజేడు: మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం తహసీల్దార్ వీరభద్రప్రసాద్ పరిశీలించారు. నూతన ఓటర్ల నమోదు తప్పొప్పులను సరి చేసుకోవడం కోసం ప్రత్యేకంగా క్యాంపెయిన్ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా శని, ఆదివారం బీఎల్‌ఓలు పోలింగ్ కేంద్రాల్లో ఉండి దరఖాస్తులను స్వీకరించారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు తీసుకున్న దరఖాస్తులను ఆయన స్వయంగా పరిశీలించారు. అర్హతగల ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

ములుగు/ములుగు రూరల్: రాష్ట్ర కాటన్ మిల్లర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు జిల్లాలో నేడు(సోమవారం) పత్తి కొనుగోళ్లను నిలిపివేయనున్నట్లు కాటన్ మిల్లుల యజమానులు, డీపీఆర్వో రఫిక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు సఫలం అయితే తిరిగి ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని సూచించారు. కాగా, కొనుగోళ్లు తిరిగి ఎప్పుడు ప్రారంభిస్తారనే విషయం ప్రకటనలో పేర్కొనలేదు.

మండల దీక్షలు

వాజేడు: మండల పరిధిలోని పూసూరు గ్రామంలో గురువారం అభయాంజనేయ స్వామి మండల దీక్ష కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు గురుస్వామి సౌమిత్రి వేణుగోపాల చార్యులు తెలిపారు. గురువారం రోజున పవిత్ర గోదావరిమాత నదిలో స్నానాలను ఆచరించి స్వామి వారి మాలాధారణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం



ఏటూరునాగారం: ప్రమాదవశాత్తు ఇల్లు కూలిపోయిన వావిలాల రవి కుటుంబాన్ని ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రవి ఇంటిని పరిశీలించారు. రానున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో తప్పకుండా న్యాయం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, టౌన్ ఉపాధ్యక్షుడు మామిడి రాంబాబు, వావిలాల పెద్ద ఎల్లయ్య పాల్గొన్నారు.

పరామర్శ

ఏటూరునాగారం: తాడ్వాయి మండలం పంబాపూర్ గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ పుల్సం సరోజన భర్త పుల్సం పురుషోత్తంకు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్ జరగగా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు పరామర్శించారు. ఆదివారం హైదరాబాదులోని నిమ్స్ హాస్పిటల్లో పురుషోత్తంను కలిసి ఆరోగ్యంపై ఆరా తీశారు.

డాక్టరేట్

పర్వతగిరి : మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన పేర్వారం కవిత హైదరాబాద్‌లోని చైతన్య డీమ్డ్ టూ బీ యూనివర్సిటీలో 'సింథసిస్ అండ్ బయోలాజికల్ స్టడీస్ ఆన్ ఆక్సిజన్, నైట్రోజన్ కంటెయినింగ్ హెటిరో సైక్లిక్ కాంపౌండ్స్' అంశంపై ప్రొఫెసర్ ఎస్.కవిత పర్యవేక్షణలో పరిశోధన చేసింది. ఈ సందర్భంగా ఆమెకు ఆ యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ పురుషోత్తం పీహెచ్‌డి పట్టా అందజేసి అభినందించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతుల ఆత్మహత్య

వర్ధన్నపేట : కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో రైతుల ఆత్మహత్య చోటు చేసుకుంటున్నాయని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని జగ్నాతండాకు చెందిన రైతు బానోతు మైబూ ఇటీవల ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబాన్ని దయాకర్‌రావు ఆదివారం పరామర్శించారు. మైబూను ఆత్మహత్యకు ప్రేరేపించిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో దయాకర్‌రావు మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో రైతులను అన్ని విధాలా ఆదుకున్నామని చెప్పారు. ఆత్మహత్యలు చోటు చేసుకోకుండా ఎప్పటికప్పుడు అవసరమైన సహాయక చర్యలు చేపట్టామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. హామీలతో ఓట్లు దండుకుని గద్దెనెక్కిన కాంగ్రెస్ మోసపూరిత పాలనతో రైతులను మానసిక వేదనకు గురి చేస్తోందన్నారు. రుణమాఫీ చేయక, రైతు భరోసా ఇవ్వక ప్రభుత్వం రైతులకు తీరని అన్యాయం చేస్తోందన్నారు. ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తున్నా మిల్లులను కేటాయించకుండా విధానాలు అవలంబిస్తోందంటూ ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

రోడ్లు పోశారు.. సైడ్ బర్మ్‌లు మరిచారు

- పొంచి ఉన్న ప్రమాదం
- జాడ లేని కాంట్రాక్టర్లు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు



చివరన ప్రమాదకరంగా ఉన్న సీసీ రోడ్డు



సైడ్ బర్మ్ వేయని రహదారి



సైడ్ బర్మ్ వేయని రోడ్డు

వాజేడు: లోక్ సభ ఎన్నికల కోడ్ వస్తుందని ఆదరాబాదరాగా మండలంలో సీసీ రోడ్లను వేశారు. దాంతో వారి పని పూర్తి అయిందనిపించుకున్నారేమో.. రహదారికి ఇరువైపులా మొరంతో సైడ్ బర్మ్‌లు వేయాలనే ఆలోచన మరిచారు. వాజేడు మండలంలో సుమారుగా 30 సీసీ రోడ్లను ఎన్నికల ముందు వేశారు. రహదారి పనులు జరుగుతుండటంతో ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ప్రజలు రహదారి కష్టాలు తప్పిపోయాయని భావించారు. కానీ సంబంధిత కాంట్రాక్టర్లు రహదారికి ఇరువైపులా వేయాల్సిన సైడ్ బర్మ్ పనులను వేయకుండా వదిలేశారు. ఆ పనులను ఎప్పుడు పూర్తి చేస్తారో.. కూడా ప్రజలకు తెలియదు. అసలు ఆ పనులను చేస్తారా..? లేక అలానే వదిలేస్తారా ? అని ప్రజలు చర్చించుకుంటున్నారు. రహదారుల చివరన కూడా వాలు పెట్టకపోవడంతో ద్విచక్రవాహనాలతోపాటు ఇతర వాహనాలు పైకి ఎక్కడంతోపాటు కిందకు దింపేందుకు వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో రహదారికి దగ్గరే ఇళ్లు ఉన్నప్పటికీ చుట్టు తిరిగి రావాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ రహదారులపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. సైడ్ బర్మ్ పనులను చేసే అవకాశం ఉన్నప్పటికీ కాంట్రాక్టర్ల జాడ లేదు. అసలు సైడ్ బర్మ్ పోస్తారా? లేదో? కూడా తెలియని అయోమయ పరిస్థితి ఉందని స్థానికులు చెబుతున్నారు. అటు అధికారులు.. ఇటు నాయకులు పట్టించుకోకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు.

హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపనను అడ్డుకుంటాం

- తుడుందెబ్బ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని వై జంక్షన్ వద్ద నిర్మించతలపెట్టిన హనుమాన్ విగ్రహం ప్రతిష్ఠాపనను అడ్డుకుంటామని తుడుందెబ్బ నాయకులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన తుడుందెబ్బ నాయకుల సమావేశంలో పొడెం బాబు, చందా రఘుపతి, కోరగట్ల లక్ష్మణ్‌రావు, వంక నరేశ్, పొడెం కృష్ణప్రసాద్, కోటి రవి, నల్లబోయిన కోటయ్య మాట్లాడారు. వై జంక్షన్ వద్ద హనుమాన్ విగ్రహం భూమి పూజ ఈనెల 14వ తేదీన జరగకుండా అడ్డుకుంటామన్నారు. అక్కడ కొమురం భీమ్ విగ్రహాన్ని ఇప్పటికే ప్రతిష్ఠించుకున్నామని, వై జంక్షన్ పేరును కొమురం భీమ్ జంక్షన్‌గా మార్చుకున్నామని తెలిపారు. అక్కడ హనుమాన్ విగ్రహం ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో చందా సత్యారావు, పాయం లక్ష్మణ్, కాక భాస్కర్, చెరుకుల ధర్మయ్య, పెనుక సమ్మయ్య, అర్రెం సత్యవతి, మల్లెల లక్ష్మి, పెనక చంద్రకళ పాల్గొన్నారు.

మహిళపై అడవి పంది దాడి

కొత్తగూడ: అడవి పంది దాడిలో మహిళకు గాయాలు అయిన సంఘటన మండలంలోని బత్తులపల్లిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా ఏటూరునాగారానికి చెందిన గాదర్ల సమ్మక్క బత్తులపల్లిలోని బంధువుల మక్కజొన్న చేను విరిచేందుకు వచ్చింది. కంకులు విరుస్తుండగా చేనులో మకాం వేసుకుని ఉన్న అడవి పంది ఒక్కసారిగా దాడి చేసింది. ఈ ఘటనలో సమ్మక్కకు కాలు విరిగింది. చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు.

సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలి



ఏటూరునాగారం: రామన్నగూడెంలో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ జగదీష్



వాజేడు: సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్

ఏటూరునాగారం: మండలంలోని కొనసాగుతోన్న సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, తహసీల్దార్ జగదీశ్ తెలిపారు. ఈనెల 9 నుంచి మొదలైన సర్వే వార్డుల వారీగా కొనసాగుతుందన్నారు. ప్రజలు ఇంటి వద్దనే ఉండి వారి సమాచారాన్ని సర్వే బృందానికి అందజేయాలని కోరారు. రామన్నగూడెంలో జరుగుతున్న సర్వేను తహసీల్దార్ పరిశీలించారు. ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించాలన్నారు. ఎలాంటి ఓటీపీలు, ధ్రువ పత్రాలను తీసుకోవడం ఉండదన్నారు. కేవలం సమాచారం ఇస్తే సరిపోతుందన్నారు. ప్రజలు ఎలాంటి భయానికి గురికావాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి

కన్నాయిగూడెం: మండలంలో చేపట్టిన సర్వేను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక ఎంపీడీఓ అనిత అన్నారు. మండలంలోని చింతగూడెంలో నిర్వహిస్తున్న సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. సర్వేకు ప్రజలు సహకరించాలన్నారు. ఆదివారం ఒకరోజులో 591 కుటుంబాలను సర్వే చేసినట్లు తెలిపారు.

అన్ని కుటుంబాల వివరాలు నమోదు చేయాలి

వాజేడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వేలో ప్రతీ కుటుంబం వివరాలు నమోదు చేయాలని తహసీల్దార్ వీరభద్రప్రసాద్, ఎంపీఓ శ్రీకాంతనాయుడు అన్నారు. ఆదివారం వాజేడు మండలంలోని 102 బ్లాకుల్లో రెండో రోజు చేపట్టిన సర్వేను వారు పరిశీలించారు. 66 మంది ఎన్యుమరేటర్ల ఆధ్వర్యంలో కొనసాగుతున్న సర్వే విధానాన్ని వారు పర్యవేక్షించారు. సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్ మండలంలోని కొంగాల, పూసూరు, ప్రగళ్ల పల్లి, పెద్ద గొళ్లగూడెం, నాగారం, గుమ్మడి దొడ్డి గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న సర్వేను పరిశీలించారు.

కులగణన సర్వేలో బీసీలు భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న బట్ట మురళీకృష్ణ

ములుగు: తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కులగణన సర్వేలో బీసీలు భాగస్వాములుగు కావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బట్ట మురళీకృష్ణ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య గత కొన్ని సంవత్సరాలుగా చేసిన పోరాట ఫలితంగానే నేడు కులగణన జరుగుతుందని అన్నారు. వరంగల్ మహాసభలో రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ ప్రకారం సర్వే చేయడం హర్షనీయం అని అన్నారు. కొంతమంది సర్వేలో వివరాలు చెబితే పింఛన్లు, రేషన్ కార్డులు తీసివేస్తారని చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మకూడదని సూచించారు. ఎన్యుమరేటర్లకు సమాచారాన్ని అందించి సహకరించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు మంచర్ల నాగేశ్వర్‌రావు, యూత్ జిల్లా అధ్యక్షుడు తోటకూరి శ్రీకాంత్, నియోజకవర్గ ఇన్‌చార్జి బక్కి నవీన్, మల్లంపల్లి యూత్ అధ్యక్షుడు వేణు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే సరైన ధర



దుగ్గొండి : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ రాజేశ్వర్‌రావు



పర్వతగిరి : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైస్ చైర్మన్ నవీన్‌కుమార్

దుగ్గొండి : సొసైటీల ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి సరైన ధర లభిస్తుందని స్థానిక సొసైటీ చైర్మన్ సుకినే రాజేశ్వర్‌రావు తెలిపారు. మండలంలోని నాచినపల్లి, తిమ్మంపేట, లక్ష్మీపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర లభించడంతోపాటు సన్న రకం ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ అందుతుందని తెలిపారు. రైతులు దళారులకు ధాన్యం విక్రయిస్తే మోసపోతారని చెప్పారు. ధాన్యం కాంటా అయిన 3 రోజులకు రైతుల బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు గుడిపెల్లి ధర్మారెడ్డి, డైరెక్టర్లు నల్ల శ్యాంసుందర్‌రెడ్డి, సురావు సంజీవరెడ్డి, గోసంగి పురుషోత్తం, మోకిడె ప్రభాకర్, హన్మకొండ లలిత బాబు, నరహరి సునీత రాజ్‌కుమార్‌రెడ్డి, కోమాండ్ల సూరారెడ్డి, మాజీ సర్పంచ్‌లు పెండ్యాల మమత రాజు, శ్రీరామోజు ప్రభాకర్, సీఈఓ ఓంకార్, సిబ్బంది సుధాకర్, రంగయ్య పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలంలోని నారాయణపురం, అన్నారం పెద్దతండా, బూర్గుమళ్ల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ వైస్ చైర్మన్ సందెల నవీన్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డైరెక్టర్లు లక్ష్మినారాయణ, అశోక్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్, సీఈఓ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగు లాభదాయకం



మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారి తరుణ్

చెన్నారావుపేట : ఆయిల్ పామ్ సాగు లాభదాయకమని ఉద్యాన శాఖ అధికారి తరుణ్, రాంచరణ్ ఇండస్ట్రీస్ జీఎం సతీశ్ నారాయణ తెలిపారు. మండలంలోని లింగాపురంలో రైతు పండుగ నరేందర్‌కు చెందిన వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామ్ సాగుపై ఆదివారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో తరుణ్, సతీశ్ మాట్లాడారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ ఇస్తోందని చెప్పారు. ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మిగతా పంటలతో పోలిస్తే ఆయిల్ పామ్ ప్రతికూల వాతావరణ పరిస్థితులను సైతం తట్టుకుని మెరుగైన పంట దిగుబడి అందిస్తుందని తెలిపారు. కోతుల బెడద, పశువుల బెడద ఉండదన్నారు. మూడేళ్లపాటు అంతర పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. ఆయిల్ పామ్ కొరత తీవ్రతను తట్టుకునేలా సాగు విస్తీర్ణం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ, ఇతర ప్రోత్సాహకాలను వివరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ బాదావత్ వినోద్ కుమార్, దేవరాజు, తదితరులు పాల్గొన్నారు.

చెత్తాచెదారం.. పిచ్చి మొక్కలు

- అపరిశుభ్రంగా మారిన మండల పరిషత్ కార్యాలయం
- ఎక్కడ చూసినా పేపర్ ప్లేట్స్ దర్శనం
- పట్టించుకోని అధికారులు



కార్యాలయం ఎదుట పరిస్థితి..



కార్యాలయం ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణం పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో పేరుకుపోయింది. నిత్యం కార్యాలయానికి వచ్చి వెళ్లే మండల అధికారులు ఆవరణలో పేరుకుపోయిన చెత్త, ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కల తొలగింపుపై దృష్టి సారించకపోవడం గమనార్హం. కార్యాలయం ప్రవేశంలోనే చెత్తతోపాటు కార్యాలయ సిబ్బంది తిని పడేసిన ఇస్తరాకులు, పేపర్ ప్లేట్స్ వేయడంతో కార్యాలయం ఆవరణ అపరిశుభ్రంగా దర్శనమిస్తుంది. ఇప్పటికైనా అధికారులు కార్యాలయం ఆవరణంలో చెత్తను తెలగించేలా చర్యలు చేపట్టాలని వివిధ అవసరాల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు కోరుతున్నారు.

'హామీల అమలులో కాంగ్రెస్ విఫలం'

దుగ్గొండి : ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ నర్సంపేట నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్ కంభంపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని గిర్నిబావిలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీపై అభిమానంతో నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు దూసుకుపోతోందని తెలిపారు. ఇప్పటికే 23 వేల సభ్యత్వాలు పూర్తి చేశామన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు అన్న లింగన్న, బుసాని రమేశ్, కొట్టూరి రమేశ్, వేమునూరి శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభను విజయవంతం చేయండి

చెన్నారావుపేట : ఈనెల 17న తలపెట్టిన సీపీఎం చెన్నారావుపేట, నెక్కొండ, పర్వతగిరి మండలాల ఏరియా కమిటీ ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని మండల కార్యదర్శి నమిండ్ల స్వామి కోరారు. మండల కేంద్రంలో మహాసభ కరపత్రాలను ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజాఉద్యమాలు చేపట్టే దిశగా మహాసభలో కార్యాచరణకు రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు భూపాల్‌రెడ్డి, శారద, మధుకర్, నరేశ్, జన్ను రమేశ్, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

'భూపంపిణీ ఘనత న్యూడెమొక్రసీ సొంతం'

నల్లబెల్లి : గోదావరి పరివాహక ప్రాంతంలో 12 లక్షల ఎకరాల పోడు భూములు ప్రజలకు పంచిన ఘనత సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ సొంతమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవునూరి మధు తెలిపారు. మండలంలోని మేడపల్లిలో ఆ పార్టీ ఆధ్వర్యంలో దుస్సా చేరాలు, రాయల రమేశ్, మార్తినేని సంపత్‌రావు, తక్కళ్లపల్లి బాబురావు సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత అమరవీరుల స్థూపాల వద్ద నివాళులర్పించారు. అనంతరం డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్ అధ్యక్షతన నిర్వహించిన సభకు మధు హాజరై మాట్లాడారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇడంపాక శ్రీశైలం, ఇట్టబోయిన రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటపాటలు ప్రజలను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు మండల వెంకన్న, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై మహాన్యాస రుద్రాభిషేకం



మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు



భక్తులతో కిక్కిరిసిపోయిన శ్వేతార్క ఆలయం

మడికొండ: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మెట్టు రామలింగేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయంపై ఆదివారం సామూహిక మహాన్యాస రుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం ప్రదోషకాల రుద్రాభిషేకం, నీరాజన మంత్రపుష్పం, నక్షత్ర హారతి, పవళింపు సేవా నిర్వహించారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి కే.శేషు భారతి, శివాలయం చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణశర్మ, ధర్మకర్తలు బైరి రాజుగౌడ్, రొడ్డ దయాకర్, దండిగం శ్రీనివాస్, బోగి కేదారి, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, వస్కుల ఉమ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

శ్వేతార్క ఆలయంలో ప్రత్యేక పూజలు

కాజీపేట: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో సప్త నది జలాలతో స్వామివారికి పండితులు ఆదివారం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. హైదరాబాద్‌కు చెందిన భక్తులు అధిక సంఖ్యలో శ్వేతార్క ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ఆవరణలో కొలువుదీరిన 29 దేవతామూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ విశిష్టత, నిత్య పూజల వివరాలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్వర్లుశర్మ వివరించారు. అన్నపూర్ణ భవన్‌లో భక్తులందరికి మహాన్నదానం చేశారు.

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వ అలసత్వం



మాట్లాడుతున్న మల్లారెడ్డి

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం వహిస్తుందని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సామ మల్లారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా మల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన 15రోజుల్లోనే రెండు డీఏలు ప్రకటిస్తామని, ఆరునెలల్లో మెరుగైన పీఆర్సీని ప్రకటిస్తామని, పెండింగ్ బిల్లులు క్లియర్ చేస్తామని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని చెప్పి పరిష్కరించలేదన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయుల, సిబ్బందికి మినిమం టైం స్కేల్ ఇవ్వాలని, వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మురళీ కృష్ణ, ప్రధాన కార్యదర్శి యాకుబ్, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, హరినాయక్ పాల్గొన్నారు.

సమాజంలో రచయితల పాత్ర కీలకం

- ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్



పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్: సమాజంలో కవులు, రచయితల పాత్ర కీలకమని ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కవి, రచయిత, సామాజిక, సాహిత్య విశ్లేషకులు సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి రచించిన శంఖారావం పుస్తకంను ఆదివారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి రచనలు సమాజానికి ఎంతో మేలు కలిగేలా ఉన్నాయన్నారు. కవులు రచయితలు చేసే కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కవులకు రచయితలకు సముచితస్థానం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి, బి.కృష్ణ, శర్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే సీపీఐ లక్ష్యం

నెక్కొండ : ప్రజాసమస్యల పరిష్కారమే సీపీఐ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్ తెలిపారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో ఆదివారం ఏర్పాటు చేసి సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా ఊరూరా ఉత్సవాలు నిర్వహించాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. లక్షలాది ఎకరాల భూస్వాముల, పెత్తందార్ల భూములను పేదలకు పంచిన ఘనత పార్టీకే దక్కుతుందన్నారు. ఆంగ్లేయులను దేశం నుంచి తరిమిన పోరాటంలో పార్టీ పాత్ర క్రియాశీలకమని తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నేటికీ యువతకు ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శులు బాషుమియా, పనాస ప్రసాద్, మండల కార్యదర్శి కందిక చెన్నకేశవులు, జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేశ్, మియాపురం గోవర్ధనాచారి, నాయకులు పర్వతం ఎల్లస్వామి, శంకర్, శ్రీనివాస్, యాకయ్య, స్వరూప, మహేందర్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.